ప్రజాశక్తి
శనివారం 14 జనవరి 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# సంక్రాంతి రద్దీ

- కిక్కిరిసిన షాపింగ్ మాల్స్
- జనంతో నిండిన నగర రహదారులు
- ఆర్‌టిసిలో సాధారణం కంటే 30 శాతం ప్రయాణాలు పెరుగుదల
- విశాఖ నుంచి దూర ప్రాంతాలకు 10 జతల రైళ్లలో రోజుకు 55 వేల మంది ప్రయాణం



కిక్కిరిసిన పూర్ణా మార్కెట్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
సంక్రాంతి.. ప్రజల్లో సందడిని పెంచే పండగ. వారం రోజుల ముందు నుంచే ఈ పండగకు రాకపోకలు మొదలైపోతాయి. ప్రయాణాల హడావుడిలోనే సమస్త జనం ఉంటారు. రైళ్లు, బస్సులు, ఇతర రవాణా సాధనాలు, షాపింగ్ మాల్స్, ఇతర దుకాణాలు రద్దీగా మారిపోతాయి. ఈ క్రమంలోనే శుక్రవారం విశాఖలోని షాపింగ్‌మాల్స్ అన్నీ వచ్చి పోయే జనాలతో కిక్కిరిసిపోయాయి. కేవలం బట్టల వ్యాపారాలే రూ.వేల కోట్లకు చేరుకోనున్నాయని తెలుస్తోంది. మరోవైపు నగర రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా మారిపోయాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, ఇక్కడ నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారూ ఏటా పెరుగుతున్న సంగతి తెలిసిందే. గత రెండేళ్లు కోవిడ్ వాతావరణం అలుముకోవడంతో పెద్దగా సంక్రాంతి సందడి కానరాలేదు. ఈ సంవత్సరం కోవిడ్ భయానక పరిస్థితులు లేనందున జనం తమ తమ అవసరాల కోసం మార్కెట్లలోకి వెళ్లి అవసరమైన వస్తువులను కొనుగోలు చేసుకోవడం కనిపించింది. ఆర్టీసీలో మామూలు రోజుల కంటే 30 శాతం ప్రయాణాలు పెరిగాయి. రైల్వేలో మామూలు రోజుల్లో 35 వేల మంది విశాఖ నుంచి ప్రయాణం మిగతా 2లో..



ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో జన రద్దీ



వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

## ఉపాధ్యాయుల సర్దుబాటు నిలిపేయండి

### ఫ్యాప్టో ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి - అనకాపల్లి : ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటును నిలుపుదల చేయాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో శుక్రవారం అనకాపల్లి డిఇఒ కార్యాలయంలో ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియ ప్రస్తుతం కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఈలోగా ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు చేస్తామని, గతంలో ప్రమోషన్ కోసం అంగీకారం తెలిపిన ఉపాధ్యాయులను హైస్కూళ్లలో సర్దుబాటు చేసి వారికి రూ.2500 చెల్లిస్తామని విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. జనవరి 20 తర్వాత అపాయింట్‌మెంట్ తీసుకున్న ఉపాధ్యాయులకు కొత్త స్థలాల్లోనే జీతాలు చెల్లిస్తామని విద్యా ప్రిన్సిపల్ సెక్రటరీ కలెక్టర్ల సమావేశంలో చెప్పారన్నారు. విద్యాశాఖ కమిషనర్, పిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన ఉత్తర్వులు భిన్నంగా ఉన్నందున ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళంలో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి సెలవుల అనంతరం ఉపాధ్యాయ మిగతా 2లో..





ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

## వాటర్ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మొట్టమొదటిసారిగా విశాఖలో ఏర్పాటు చేసిన వాటర్ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్‌ను బీచ్ రోడ్‌లోని ఎయు గ్రౌండ్స్‌లో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రారంభించారు. పిల్లలతో కలిసి ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్‌లో ప్రపంచంలోనే ప్రఖ్యాతి చెందిన దేశాల్లో ఉన్నటువంటి ఎంతో ఖరీదైన చేపలను, సముద్ర గర్భంలో కంటికి కనబడని జీవరాశులను తెచ్చి అందుబాటులో ఉంచారన్నారు. రంగురంగుల మత్స్య సంపద అండర్ వాటర్‌లో కనువిందు చేయడం ఇక్కడి ప్రత్యేకతన్నారు. నిర్వాహకులు రాజారెడ్డి ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ విశాఖ వాసులను విపరీతంగా ఆకట్టుకోనుందని తెలిపారు. జెయింట్ వీల్, మిగతా 2లో..

## స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు విశాల ఉద్యమం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకూడదనే డిమాండ్‌తో చేపట్టిన ఉద్యమం విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ విశాల ఉద్యమంగా మారిందని సిఐటియు కంచరపాలెం జోన్ అధ్యక్షులు బి.సింహాచలం తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 653వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ కార్మికులు కూర్చున్నారు. వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయరాదంటూ ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో ఇప్పటికే నిరసన కార్యక్రమాలు, దీక్షలు సాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 30న స్టీల్ ప్లాంట్ వద్ద అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్పటికీ కేంద్ర ప్రభుత్వం దిగి రాకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. దేశానికి ప్రధాన మంత్రులుగా పనిచేసిన వారందరూ ఏదో ఒక భారీ పరిశ్రమను ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేశారని, మోడీ ప్రధాని అయ్యాక ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో ఒక్క ప్రభుత్వ రంగ పరిశ్రమను ఏర్పాటు చేయలేదు సరిగదా ఉన్నవాటిని అమ్మకానికి పెట్టారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ దుర్మార్గ చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం జోన్ నాయకులు ఎస్.రామ్‌గోపాల్, పాండు, వి.మహేశ్వరి, వి.నరసమ్మ, వి.భూలోకమ్మ, గౌరమ్మ, ఎయు మాజీ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న సిఐటియు కంచరపాలెం జోన్ నాయకులు

మొదటి పేజీ తరువాయి..



విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

## సంక్రాంతి రద్దీ

చేస్తుండేవారు. గడచిన రెండు రోజులుగా రోజుకు 55 వేల మంది రైళ్లలో విశాఖ నుంచి వెళ్తున్నారు. 10 జతల కొత్త రైళ్లను సంక్రాంతి సందర్భంగా విశాఖ నుంచి రైల్వే నడుపుతోంది. ఈ నెల 10వ తేదీ నుంచి బట్టల షాపులన్నీ కళకళలాడుతున్నాయి. అంతకు ముందు బంగారం షాపులు, మార్కెట్‌లోని గ్లోసరీస్, చెప్పులు, ఇతర ఫర్నీచర్, గృహోపకరణాల దుకాణాల్లో ఈ సందడి కనిపించింది. గతంతో పోల్చితే ఈ వ్యాపారాలు బాగా జరిగినట్లు నగరానికి చెందిన పలువురు వ్యాపారులు చెబుతున్నారు. ఇదివరకూ కరోనా వల్ల వ్యాపారాలు వెనకపట్టుపట్టినా ఈ ఏడు మాత్రం అన్ని రకాల వ్యాపార లావాదేవీలు ఊపందుకున్నట్టు తెలుస్తోంది. బట్టల షాపుల్లో ధరలు ఆకాశాన్నంటినా సరే.. జనం వాటికోసం పోటా పోటీగా నగరంలోని ప్రధాన షాపింగ్‌మాల్స్‌లో షాపింగ్ చేయడం కనిపించింది. 14వ తేదీన భోగీ అయినప్పటికీ కొనుగోళ్లు సాగుతాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. ఆ తరువాత సంక్రాంతికి ప్రజానీకమంతా తమతమ స్వస్థలాలకు వెళ్లనుండటంతో పట్టణం బోసిపోనుంది.

## ఉపాధ్యాయుల సర్దుబాటు నిలిపేయండి

సంఘాలతో చర్చించి స్పష్టత వచ్చిన తర్వాత పూర్తి స్థాయి ప్రమోషన్ ప్రక్రియ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సుధాకర్‌రావు, డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.మధు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి జోగా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఆరిలోవ :** ఫ్యాప్టో ఆధ్వర్యాన విశాఖ డిప్యూటీ డిఇఒ గౌరీ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాటర్ టన్నెల్ ఆక్వా ఎగ్జిబిషన్ ప్రారంభం

హార్స్ రైడింగ్, డ్రాగన్ ట్రైన్ వంటివి కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. దీనిని మూడు నెలలపాటు సబ్ మెరైన్ ఎదురుగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకుడు రాజారెడ్డి మాట్లాడుతూ ఎంతో ఖరీదైన, ఆకర్షణీయమైన చేపలను ఈ అక్వేరియంలో ప్రదర్శనకు ఉంచామన్నారు. చేనేత వస్త్రాలు, వివిధ రకాల వందలాది స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫుడ్ కోర్టులు, వివిధ రాష్ట్రాలకు చెందిన గృహోపకరణ వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. విశాఖవాసులు, పర్యాటకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## నిరుపేదలకు సాయం

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** సంక్రాంతి సందర్భంగా 50 నిరుపేద కుటుంబాలకు చారిటీ బాక్సు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బియ్యంతోపాటు 15 రకాల నిత్యావసర వస్తువులను అందజేశారు. తాటిచెట్లపాలెంలోని గ్రీన్‌బెల్ట్, పాత పోస్టాఫీసు, ఎంవిపి కాలనీ, పెదవాల్తేరు, బీచ్ రోడ్డు, మల్కాపురం తదితర ప్రాంతాలలో ఎంపిక చేసిన నిరాశ్రయులకు వీటిని అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు ప్రతినిధి చెక్కా రమాదేవి మాట్లాడుతూ తెలుగు లోగిళ్లలో సంక్రాంతి పండగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎంతో ఉత్సాహంగా ఈ పండగను జరుపుకుంటారని తెలిపారు. పేద, ధనిక తేడా లేకుండా పండగ మూడు రోజులూ అందరూ ఆనందంగా గడుపుతారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని దయనీయంగా జీవనం గడుపుతున్న కుటుంబాలను ఎంపిక చేసి ఈ నిత్యావసరాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో చారిటీ బాక్సు ప్రతినిధులు దౌలూరు శంకరరావు, టి.కరుణాకర్, వురిటి శ్రీనివాసరావు, మదీనా బీబీ, లక్కోజు సాయికుమార్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



# భోగి మంటలో జిఒ 1 కాపీలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోగి మంట వేసి జిఒ నెంబరు 1 కాపీలను ఆ మంటలో తగలబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు దువ్వారపు రామారావు మాట్లాడారు. చీకటి జిఒను రద్దు చేయాలన్నారు. పార్టీ దక్షిణ నియోజవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, విశాఖ పార్లమెంటు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు లొడగల కృష్ణ, ఆరేటి మహేష్, ఉపాధ్యక్షులు వి.చంద్రశేఖర్, వాండ్రసి అప్పలరాజు, పైలా ముత్యాల నాయుడు, తోట రత్నం, మొల్లి లక్ష్మణ, జిల్లా నాయకులు ఎర్నాగుల జగదీష్, ఈతలపాక సుజాత పాల్గొన్నారు.



జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

# సంక్రాంతి వెలుగులు నింపాలి

### రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** నూతన సంవత్సరంలో వస్తున్న మకర సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో వెలుగును, సంతోషాన్ని, ఆనందాన్ని నింపాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆకాంక్షించారు. శుక్రవారం మద్దిలపాలెంలోని వైసిపి నగర కార్యాలయంలో జరిగిన సంక్రాంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి ఆవశ్యకతను తెలియజేశారు. జగనన్న పాలనలో రాష్ట్రంలోని రైతులు సుభిక్షంగా వున్నారని, కరోనా కష్ట కాలంలో కూడా రైతులకు ఏ లోటూ రాకుండా రాష్ట్ర ప్రభుత్వం చూసుకుందని తెలిపారు. వైసిపి జిల్లా అధ్యకులు పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ సంక్రాంతి రైతుల పండగని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నాయకులు బొడ్డేటి కాశీవిశ్వనాథ్, రవి రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. భోగి మంట వేసి పార్టీ మహిళా కార్యకర్తలు సంక్రాంతి పాటలు పాడారు.




సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆటపాటలతో సందడి చేస్తున్న వైసిపి మహిళా నేతలు

## పిడకలపై నగరవాసుల ఆసక్తి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** భోగి పిడకలకు విశాఖ నగరంలో ఆదరణ పెరిగిందని గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొద్ది కాలం క్రితం వరకూ భోగి పండగకు ఆవు పేడతో చేసిన పిడకలను మాత్రమే వాడేవారన్నారు. తర్వాత కాలంలో కలప వచ్చి చేరిందన్నారు. ఆ తర్వాత కాలంలో ఇళ్లలో పనికిరాని వస్తువులను వినియోగించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాలు, వాహనాల టైర్లు వినియోగిస్తున్నారని, దీని వల్ల విష రసాయనాలు విడుదలవుతున్నాయని పేర్కొన్నారు. ఫలితంగా క్యాన్సర్ సహా పలు రకాల వ్యాధులు వస్తాయన్నారు. విశాఖలో గడిచిన రెండేళ్లలో ఆవు పేడ పిడకలు అమ్మేవారు పెరిగారన్నారు.

# పథకం ప్రకారమే హత్య!



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి శ్రీనివాసరావు

- వలందపేట కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్
- నాలుగు సెల్‌ఫోన్లు, నిద్ర మాత్రల స్ట్రిప్, ప్లాస్టిక్ టాగ్‌వైర్ స్వాధీనం..
- మీడియాతో నార్త్ ఎసిపి శ్రీనివాసరావు

వలందపేటకు చెందిన వంకా పైడిరాజు (34)ను, అతని భార్య జ్యోతి, ఆమె ప్రియుడు, వాసువానిపాలెం, జాలరి ఎండాడకు చెందిన రాజ్‌కుమార్, శ్రీనివాసరావు అనబడే వాడమదుల నూకరాజు కలిసి హత్య చేశారు. గంగవరం, జాలరిపల్లిపాలేనికి చెందిన కె.భూలోక హత్యకు సహకరించారన్నారు.

ప్రజాశక్తి -భీమునిపట్నం :జివిఎంసి, భీమిలి జోన్, రెండోవార్డు వలందపేటలో గతనెల 29న రాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు చేధించారు. పథకం ప్రకారమే హతుడి భార్య, ఆమె ప్రియుడు, మరో వ్యక్తి సాయంతో హత్యచేసి, మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లి దహనం చేసినట్లు గుర్తించారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను శుక్రవారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియా సమావేశంలో స్థానిక సిఐ కె.లక్ష్మణమూర్తి, ఎస్‌ఐలు గంటా హరీష్, ఎం భరత్‌కుమార్‌రాజులతో కలిసి విశాఖ నార్త్ డివిజన్ ఎసిపి సిహెచ్ శ్రీనివాసరావు వెల్లడించారు. వివరాలివి.

హత్యకేసులో నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించే ప్లాస్టిక్ ట్యాగ్ వైర్, నిద్ర మాత్రల స్ట్రిప్‌తోపాటు నాలుగు సెల్ ఫోన్లును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**పథకం ప్రకారమే హత్య**

వలందపేటలో హత్య పక్కా పథకం ప్రకారమే జరిగిందని ఎసిపి శ్రీనివాసరావు వెల్లడించారు. డిసెంబర్ 29న రాత్రి సుమారు 12 గంటల సమయంలో తన ప్రియునితో కలిసి హతుడి భార్య జ్యోతి, తన భర్త పైడిరాజు హత్యకు పథకం రచించింది. భీమిలిలో ఓ మందుల దుకాణంలో 10 నిద్రమాత్రలు కొన్నారు. వాటిలో ఆరింటిని అన్నంలో కలిపి భర్తకు పెట్టింది. నిద్రమాత్రలు కలిపిన అన్నం తిన్న పైడిరాజు గాఢ నిద్రలోకి జారుకోవడంతో వెంటనే ప్రియుడికి ఫోన్ చేసింది. అప్పటికే సిద్ధం చేసుకున్న ప్లాస్టిక్ ట్యాగ్ వైర్‌తో తన సమీపబంధువు భూలోకతో కలిసి స్కూటీపై వలందపేటలో ఉన్న పైడిరాజు ఇంటికి చేరుకున్నాడు. భూలోక ఇంటి బయట ఉండగా, జ్యోతి, తన భర్త పైడిరాజు కాళ్లను కదలకుండా పట్టుకోగా, వెంట తెచ్చిన ప్లాస్టిక్ ట్యాగ్ వైర్‌తో హతుడి గొంతును బలంగా నొక్కి హత్య చేశారు. వెంటనే వచ్చిన స్కూటీపై మృతదేహాన్ని ఉంచి, విశాలాక్షి నగర్‌లో ఉన్న రూమ్‌కు తీసుకెళ్ళి, అక్కడ నుంచి జాలరిపేట శ్మశానవాటికకు అంబులెన్స్‌లో తీసుకెళ్లి దహనం చేశారు.

## నేరాలు ఘోరాలు

### ఎన్‌డిపిఎల్ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి -భీమునిపట్నం/ పద్మనాభం : పద్మనాభం మండలం, రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆళ్ల ఆది వెంకట సూర్యనారాయణను 160 కేసుల ఎన్‌డిపిఎల్ మద్యం కేసులో ఈ నెల 10వ తేదీన విశాలాక్షినగర్‌లో అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. తెలంగాణలో నమోదైన ఎన్‌డిపిఎల్ కేసులో కూడా ఇతనే నిందితుడు కావడంతో తదుపరి విచారణ కొరకు, తెలంగాణ ఎక్సయిజ్ పోలీసు అధికారులు కస్టడీకి తీసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ బి శ్రీనాధుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### రెండున్నర తులాల బంగారం చోరీ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని వెంకటాపురం పంచాయతీ కర్రి వారి కల్లాల వద్ద గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కర్రి పెద్దన్న ఇంట్లోని రెండున్నర తులాల బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. బాధితుడి నుంచి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు క్రైం సిఐ డి.రమేష్ తెలిపారు.

# గీతం ప్రవేశాలపై అవగాహన




అవగాహన కల్పిస్తున్న గీతం యాజమాన్య ప్రతినిధి


ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ (బి.టెక్, ఎమ్‌టెక్), ఫార్మశీ (బి.ఫార్మశీ, ఎమ్.ఫార్మశీ), ఎమ్.ఆర్క్, మేనేజ్మెంట్, లా, సైన్స్, హ్యూమేనిటీస్, నర్సింగ్ పారామెడికల్ కోర్సులలో 2023 విద్యా సంవత్సరంలో ప్రవేశాలపై నగరంలోని కళాశాలల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ విజయశేఖర్, గీతం స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర, అడ్మిషన్ల విభాగం పర్యవేక్షక అధికారి జగదీష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్)–2023 పేరిట దేశవ్యాప్తంగా 134 కేంద్రాలలో ఆన్‌లైన్‌లో నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు గీతం ప్రాంగణాలలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించడానికి స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామన్నారు. గీతం ప్రవేశ పరీక్షలోనూ, జెఇఇ మెయిన్స్ జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలోనూ, ఎపి ఇఎపి సెట్, తెలంగాణ ఎంసెట్ ప్రవేశపరీక్షలతో పాటు జాతీయస్థాయి పోటీ పరీక్షలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఫీజులో రాయితీ అందిస్తామన్నారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి కొత్తగా గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్‌షిప్ అందచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వివిధ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉద్యోగ అవకాశాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసారు.

# నిత్యావసరాల అందజేత

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లోని 42మంది సభ్యులకు పోతిన నాయుడుబాబు మెమోరియల్ ట్రస్ట్ సంక్రాంతి కానుకగా నిత్యావసరాలను పిఎన్. కన్స్ట్రక్షన్స్ అధినేత పోతిన నాగేశ్వరరావు(నగేష్) శుక్రవారం అందించారు.కార్ షెడ్‌జంక్షన్ పిఎన్‌బి కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నగేష్ మాట్లాడుతూ, జర్నలిస్టులంటే తనకెంతో గౌరవం, అభిమానమని, మధురవాడ ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి అవసరమైతే సాయం అందిస్తానన్నారు. మధురవాడ జోన్ పరిధిలోని వివిధ పత్రిక విలేకర్లు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు అభినందన



బిఎం శ్యాంప్రసాద్‌ను అభినందిస్తున్న బలిరెడ్డి, లీల

ప్రజాశక్తి- గాజువాక : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా రూ.82కోట్ల వార్షిక లావాదేవీలతో బిజినెస్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న అగనంపూడి బ్రాంచ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఎన్ శ్యాంప్రసాద్‌కు అగనంపూడి అభివృద్ధి కమిటీ, ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ శుక్రవారం పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. బలిరెడ్డితో పాటు డ్వాక్రా రిసోర్స్‌పర్సన్ టి.లీల, తోకాడ రాము, బండారు చందు, రమేష్ తదితరులు బిఎం శ్యాంప్రసాద్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిఎం శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, స్థానిక నేతలు, బ్యాంకు ఖాతాదారుల సహకారంతో 2022 ఆర్థిక సంవత్సరంలో యూనియన్ బ్యాంకు అగనంపూడి బ్రాంచ్‌లో రూ.82కోట్ల లావాదేవీలు జరిపామన్నారు. వీటిలో డిపాజిట్లు రూ.48.40 కోట్లు కాగా, వివిధ రకాల రుణాల కింద రూ.33.60కోట్లను వినియోగదారులకు అందించామన్నారు తీసుకున్న రుణాలను సక్రమ వాయిదాల్లో తిరిగి చెల్లిస్తే మరింత మందికి రుణసాయం చేసే అవకాశం ఉంటుందని వివరించారు. యూనియన్ బ్యాంకులో రూ.17 నుంచి రూ.300 వార్షిక ప్రీమియంతో 18–70 ఏళ్ల వయస్సున్నవారికి రూ.లక్ష నుంచి రూ.30లక్షల వరకు బీమా సౌకర్యం ఉందన్నారు సీనియర్ సిటిజన్స్ డిపాజిట్లకు మెరుగైన వడ్డీ ఇస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీలకు ముద్ర, రాయితీ రుణాలిచ్చి ఆదుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు ఆర్‌కార్డుపై రుణసదుపాయం కల్పించాలన్నారు. 79 వ వార్డు పాతఅగనంపూడి, శనివాడ, గల్లావానిపాలెంలో ఎటిఎం ఏర్పాటు చేయాలని కోరారు.

# ప్రజల వద్దకే పథకాలు, పౌరసేవలు

**గడపగడపలో గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఉత్తర సమన్వయకర్త కెకె.రాజు**



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి



సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి -కంచరపాలెం : ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు, పౌర సేవలు అందించాలనే లక్ష్యంతో వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు అన్నారు. శుక్రవారం 48వ వార్డు బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో గడపగడపకూ నమ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డు ఇన్‌ఛార్జి నీలి రవితో కలిసి ఇంటింటా పర్యటించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఎవరికి ఎంత లబ్ధి చేకూరిందో బ్రోచర్లను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, 48వ వార్డు నాయకులు కర్రి రామరెడ్డి, భూలోక రవి, నాగేశ్వరావు, సుగుణకుమారి, డొప్ప శ్రీను, జాగరపు నరేష్, సాల్మన్‌రాజు, చౌదరి, విష్ణు, లక్ష్మి, కలంపూడి శ్రీను, కండిపల్లి శ్రీను, కనక, మహేష్, భరత్, చిరంజీవి, రాఘవలు, అంబటి శైలేష్, కె.చిన్న, షేక్ బాబ్జి, జక్కంపూడి సత్యనారాయణ, సమెట్ల వెంకటేష్, అమర్ పాల్గొన్నారు.

**గాజువాక** : పేదల అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు.శుక్రవారం 87వ వార్డు వడ్లపూడిలో గడపగడపకు ప్రభుత్వంలో భాంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను వివరించారు.కార్యక్రమంలో దామోదర్, దానప్పలు గోవిందరాజులు, పాపారావు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలరాజు

ప్రజాశక్తి -భీమునిపట్నం : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్నదే సిఎం జగన్మోహనరెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా వార్డు, గ్రామ వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, త్వరలో నియామకం కానున్న గృహసారథులు పని చేయాలని వైసిపి భీమిలి నియోజకవర్గ పరిశీలకులు, మాజీ మంత్రి పి బాలరాజు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ అధ్యక్షతన పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లతో ఒకటో జోన్‌లోని నాలుగు వార్డుల్లో గృహ సారథుల నియామకంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువ చేయడంలో గృహ సారథులు ప్రధాన భూమిక పోషించనున్నారన్నారు.

# వైభవంగా చందనోత్సవ ర్యాలీ



చందనోత్సవ ర్యాలీలో పాల్గొన్న ముస్లిములు

ప్రజాశక్తి -కంచరపాలెం : 53వ వార్డు మర్రిపాలెం మస్జిద్ వీధిలో మస్జిద్‌ఈ ఆల్ ఫతా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హజ్రత్ ఖాదర్ వలీ, హజ్రత్ మౌలాఆలీ నిషాని ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో బాగంగా శుక్రవారం మర్రిపాలెం శ్యాంనగర్ కాలనీ, గ్రీన్ గార్డెన్స్, పార్వతీనగర్, హుస్సేన్‌నగర్, జాకీర్ హుస్సేన్ నగర్ తదితర ప్రాంతాల్లో చందనయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఢమాల్ పార్టీ పలువురిని ఆకర్షించింది. చందన యాత్ర నిర్వహించిన అనంతరం ముస్లిం సోదరులు మస్జిద్ సమీపంలో ఉన్న హజ్రత్ ఖాదర్ వలీ, హజ్రత్ మౌలాఆలీ నిషాని షరీఫ్ వద్ద 'ఫాతెహా' తభక్ అందజేశారు. కార్యక్రమాన్ని మస్జిద్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో బాబా, ఉమర్, ఉరుసు కమిటీ సభ్యులు మున్నా, నాసీర్ ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## ప్రజాశక్తి కేలండర్, డైరీ ఆవిష్కరణ



ప్రజాశక్తి కేలండర్, డైరీని ఆవిష్కరిస్తున్న జెడిసి రాము

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : ప్రజాశక్తి దినపత్రిక ముద్రించిన 2023 సంవత్సర కేలండర్, డైరీని శుక్రవారం జివిఎంసి జోనల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో జెడ్‌సి బొడ్డేపల్లి రాము ఆవిష్కరించారు.కార్యక్రమంలో ప్రజాశక్తి డివిజన్ కోఆర్డినేటర్ రఘుపతి వెంకట రమణ, స్థానిక విలేకరి చిరంజీవి పాల్గొన్నారు.

## 20 నుంచి ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో



సావనీర్ ఆవిష్కరిస్తున్న వాసవీ అధ్యక్షుడు బాలాజీ

**ప్రజాశక్తి -గాజువాక :** ఈనెల 20, 21 తేదీల్లో గాజువాక ఆటోనగర్‌లో ఎంఎస్ఎంఇ-2023 ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు వాసవీ అధ్యక్షులు ఎకె.బాలాజీ తెలిపారు. శుక్రవారం గాజువాక ఆటోనగర్‌లో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఏటామాదిరిగానే ఈ ఏడాది కూడా ఆటోనగర్‌లో వాసవి ఆధ్వర్యంలో ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా వివిధ పరిశ్రమ యజమానులు తమ ఉత్పత్తులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసుకోవచ్చునంర్నారు. పరిశ్రమలకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను ఎంఎస్ఎమ్ఇ అధికారులు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ వినోద్, అధ్యక్షులు కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు .

## గ్రామాల్లో సంక్రాంతి శోభ

### కళకళలాడిన దుకాణాలు


తాళ్లవలసతో మహిళ ఏర్పాటు చేసిన బట్టల దుకాణం

**ప్రజాశక్తి-పద్మనాభం :** మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి శోభ కనిపిస్తోంది. సాంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకునే క్రమంలో మండలంలోని 22 పంచాయతీల్లో పితృదేవతలకు సమర్పించేందుకు వీలుగా పంచెలు, తువ్వాళ్లు, ఇతర దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. ఇక పండగ సందర్భంగాధరించేందుకు కొత్త బట్టల కొనుగోలు సందడి ఉండనే ఉంది. గత కొన్నాళ్లుగా కరోనా భయంతో స్వేచ్ఛగా పండుగలను జరుపుకోలేని పరిస్థితుల్లో ఈ ఏడాది వైరస్ మహమ్మారి ముఖం చాటేయడంతో సందడిగా పండుగను జరుపుకునేందకు ప్రజలంతా సిద్ధమయ్యారు. దీంతో బట్టలు, కిరాణా ఇతరత్రా దుకాణాలు, వ్యాపార సంస్థలు కిక్కిరిసి కనిపిస్తున్నారు. మామూలు దుస్తులకు ప్రజలు దుకాణాలకు వెళుతున్నా, పండగకు సంబంధించి సాంప్రదాయ దుస్తులను మాత్రం రోడ్డు పక్కనే వేసిన దుకాణాల వద్దే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి అనుగుణంగానే ఎక్కడికక్కడే రోడ్డు పక్కల్లో దుకాణాలు వెలిసాయి. బిఆర్.తాళ్లవలస రామకోవెల వద్ద ఒక మహిళ, తునివలస నర్సాపురంలోఒక చిల్లర బడ్డీ వద్ద వ్యాపారి ఇదే మాదిరిగా బట్టల దుకాణాలను ఏర్పాటు చేశారు. మొత్తానికి ఈ ఏడాది దాదాపు అన్ని గ్రామాల్లో సంక్రాంతి శోభ స్పష్టంగా కనిపిస్తోంది.

# ప్రజా గర్జన సభను జయప్రదం చేయండి


రామారావు, సైనిబాబులను సత్కరిస్తున్న సిఐటియు నేతలు

**ప్రజాశక్తి-ఉక్కునగరం** : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజాగర్జనను జయప్రదం చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం స్టీల్‌ప్లాంట్ స్టోర్ జంక్షన్ వద్ద స్టీల్ సిఐటియు కార్యకర్తల సమావేశంలో ప్రయివేటీకరణ నుంచి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరుతూ తిరుమల పాదయాత్ర చేసిన ట్రాఫిక్ విభాగం రామారావు, బ్లాస్ట్ ఫర్నేస్ సైనిబాబులను సన్మానించారు.

ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నేడు రాష్ట్రంలోని రాజకీయ పక్షాలు విడివిడిగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. అలాకాక వారందరూ ఒకేవేదికపైకొచ్చి ప్రయివేటీకరణపై వ్యతిరేకగళాన్ని ఒక్కటై వినిపించాలన్న సంకల్పాన్ని 30న ప్రజాగర్జన విజయవంతం చేయడం ద్వారా కేంద్రానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

యూనియన్ ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ ఉద్యమాన్ని ప్రజాఉద్యమంగా మార్చడం కోసం ప్రతి ఒక్క కార్మికుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, పుల్లారావు, గంగాధర్, కెవి సత్యనారాయణ, నీలకంఠం, డిసి హెచ్‌జవెంకటేశ్వరరావు, బిఎన్ మధుసూదన్, శ్రీనివాసులురెడ్డి, వీరస్వామి, రామన్న, సూర్యనారాయణ, వివిధ విభాగాల అధ్యక్షులు కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

# క్షీణించిన పారిశుధ్యం!

**పలు గ్రామాల్లో రోడ్లపైనే మురుగునీరు**
**దుర్గంధం, దోమల బెడదతో జనం అవస్థలు**


ప్రధానరోడ్డుపై చేరి నిల్వ ఉన్న మురుగునీరు

**ప్రజాశక్తి-పద్మనాభం** : మండలంలోని బి ఆర్ తాళ్లవలస, నేరేళ్లవలస పంచాయతీలోని పలుగ్రామాల్లో పారిశుధ్యం క్షీణించించి, ప్రధాన రోడ్డుపైనే మురుగునీరు నిల్వ ఉండడంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలకు ఒకవైపు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, రోడ్లపై నిల్వ ఉన్న మురుగునీరు దోమలు, ఈగలకు ఆవాసంగా మారి ప్రజలను అవస్థలు పాల్జేస్తోంది. మరోవైపు మురుగునీరు దుర్గంధంతో ప్రజలు అగచాట్లకు గురౌతున్నారు. సంక్రాంతి పండుగకు బంధుమిత్రులంతా సొంతూళ్లకు, గ్రామాలకు చేరుకోవడంతో కళకళలాడుతున్న పల్లెలు, ఈ దుర్గంధం, ఈగలు, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. బిఆర్ తాళ్లవలసలో కంసాలి వీధిలో ప్రధానరోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తోంది. వాహనరాకపోకల సమయంలో అక్కడ ఎవరైనా ఉంటే ఇక అంతేసంగతులు. పండగకు వేసుకున్న కొత్త బట్టలు సైతం రూపురేఖలు మారిపోతున్నాయి..నేరేళ్లవలస పంచాయతీలో కోయ్యపేటతో తారురోడ్డుపైనే మురుగనీరు ప్రవహిస్తోంది.


దోమలకు ఆవాసంగా ఉన్న మురుగునీటి గుంట

## 'యువశక్తి' విజయవంతం


మాట్లాడుతున్న కార్పొరేటర్ మూర్తి యాదవ్

**ప్రజాశక్తి- సీతమ్మధార** : శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జనసేన యువశక్తి సభను విజయవంతంపై కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసిన అభిమానులు, జనసైనికులు, ఇతర నేతలు, ప్రజలకు పౌర గ్రంథాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలపై యువశక్తి వేదికగా జనసేనాని స్పష్టమైన దిశానిర్దేశం చేశారన్నారు. కశింకోట మండలం విస్సన్నపేటలో భూదందాలు, ఇసుక, గనుల మైనింగ్‌లో కమిషన్లు కాజేస్తూ, ఇప్పటికే మూడుపార్టీలు మారిన మంత్రి అమర్ జనసేనాని పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. దసపల్లా భూముల్లో ఎంత ప్యాకేజీ ముట్టిందో అమర్ చెప్పాలన్నారు. విశాఖలో విలువైన రూ.25వేల కోట్ల విలువైన భూములను వైసిపి ప్రభుత్వం తాకట్టుపెడితే, మంత్రి అమర్ నోరుమెదపడేమని ప్రశ్నించారు. పవన్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

# ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



రాంనగర్ బజారులో ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న యువతులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** రాంనగర్ బజార్ ప్రాంతంలో శుక్రవారం సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి కె.నర్సింగరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సేవ్ వైజాగ్ స్టీల్ పేరిట వేసిన ముగ్గులు చైతన్యం నింపాయి. కార్యక్రమంలో రామ్‌నగర్ ఏరియా నాయకులు కొర్ర సోములు, సిఐటియు నాయకులు వై.రాజు, కెవిపి చంద్రమౌళి, కళాధర్, కె.సంతోష్, భవన నిర్మాణ కార్మికులు రామారావు, దుర్గారావు, శ్రీనివాస్, ఐద్వా నాయకులు జి.వరలక్ష్మి, కె.మణి, సత్యవతి పాల్గొన్నారు.

**ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు**

**సీతమ్మధార** : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దొండపర్తిలోని పద్మపూజిత వీల్స్ మార్ట్ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సాయిబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.


ముగ్గుల పోటీలను తిలకిస్తున్న సంస్థ ప్రతినిధి సాయిబాబు

# కోడి పందేలకు సిద్ధం

## పోలీసుల హెచ్చరికలతో రహస్యంగా నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందేలకు పందెంరాయుళ్ల సిద్ధమవుతున్నారు. కోటి పందేలపై పోలీసులు ఆంక్షలు విధించినా, వాటిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో తీర్థాలు ఎక్కువగా జరిగేవి. ఈ తీర్థాలలో ఎడ్ల పరుగు పందేలు, కోడి పందేలు, రకరకాల పోటీలు నిర్వహించడం వల్ల ఉత్సాహ వాతావరణం సందడి కనిపిస్తూ ఉండేది. కొంతకాలంగా తీర్థాల నిర్వహణ తగ్గింది. కోడి పందేళ్ల తగ్గుతూ వచ్చాయి. అయితే సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పందెం రాయుళ్ల కోడి పందేలకు సిద్ధమయ్యారు. మండలంలోని కోయిలాపల్లి, రాజాం, సీతయ్యపేట, చోడవరం సరిహద్దుల్లోని కందిపూడి తదితర ప్రాంతాల్లో కోడి పందేలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. సంక్రాంతి కోడి పందేలకు కొద్దిరోజులుగా పందెం కోళ్లను తయారు చేస్తున్నారు. ప్రతిరోజు బలమైన ఆహారాన్ని ఇస్తూ కోళ్లకు సైతం సంరక్షణ చర్యలను చేపడుతున్నారు. పోలీసుల ఆంక్షలు ఉండడంతో గ్రామాల శివారు ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరస్పరం సమాచారం ఇచ్చుకుని రెండు మూడు జతలను పందేలు నిర్వహించి పోయే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలిసింది.

**పందెంకోడి ధర ఎక్కువే**

పందెం కోళ్ల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గతంలో రూ.1000 నుండి రూ.2000 వరకు ఉండే పందెం కోళ్ళ ధర ప్రస్తుతం రూ.5 వేలు నుండి రూ.7వేలు వరకు పలుకుతున్నాయి. పందేలపై ఆసక్తి కలిగిన వారు కోడిపుంజులను కొనుగోలు చేసుకుని కోడికి కత్తి కట్టడానికి సిద్ధమవుతున్నారు.



పందేనికి సిద్ధం చేసిన కోడి పుంజు



ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

## 75వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఓబి నిర్వాసితులు మండలంలోని వాడనర్సాపురం వద్ద నేవీ గేట్ ఎదురుగా చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి 75వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు మాట్లాడుతూ 75 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సంక్రాంతి పండగ ఎంతో గొప్పగా చేసుకుంటామని, కాని ఈ ఏడాది శారద, వరాహ నదులు గుండా వేటకు వెళ్లనీయకపోవడంతో ఉపాధి లేక పండగ చేసుకొనే పరిస్థితి లేకుండా ప్రభుత్వాలు చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలలకు పైగా ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎనిమిది గ్రామాల నిర్వాసితులు, జెఎసి నాయకులు పాల్గొన్నారు.



పిహెచ్‌సిలో తనిఖీలు చేస్తున్న డిఎంహెచ్ఓ డాక్టర్ హేమంత్

## గుల్లేపల్లి పిహెచ్‌సిలో డిఎంహెచ్ఓ తనిఖీలు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని గుల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.హేమంత్ శుక్రవారం పరిశీలించారు. పిహెచ్‌సిలోని రికార్డులను, ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌ను తనిఖీ చేశారు. నాడు-నేడు పనులను పరిశీలించి, పిహెచ్‌సిలో శానిటేషన్, క్లీనింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ రూమ్, ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న కొత్త భవనాన్ని పరిశీలించారు. బోదువలసలో జరిగిన ఫ్యామిలీ హెల్త్ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని వీధుల్లో లార్వా ఎలిమినేషన్‌ను పరిశీలించారు. రిషి విద్యాలయంలోని బాలికలకు రక్త హీనత, వ్యక్తిగత పరిశుభ్రతలపై పలు సూచనలు అందించారు. గ్రామంలోని ఎస్‌డిజి గోల్స్, ఎనీమియా మానిటరింగ్ టూల్ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఎఎన్ఎం, అంగన్వాడీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రెసిడెంట్ కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న చౌడువాడ సర్పంచ్ ఎరుకునాయుడు

ప్రజాశక్తి - కె.కోటపాడు

నూతన సంవత్సరం, సంక్రాంతి పండగను పురస్కరించుకొని మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రెసిడెంట్ కప్ క్రికెట్ టోర్నమెంటును ఆ గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనపరచాలన్నారు. క్రీడలు శరీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. యువత పెడతారి పట్టకుండా ఖాళీ సమయంలో మనసుకు ఉల్లాసాన్ని కలిగించే ఆటలు ఆడాలన్నారు. ఈ కార్యక్రమంలో మారపు రెడ్డి శివ, ద్వరి గంగరాజు, అనకాపల్లి ప్రశాంత్, వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన యువకులు పాల్గొన్నారు.



మంత్రికి బెల్లం అందజేస్తున్న పలక యశోద తదితరులు

## మంత్రికి బెల్లం దిమ్మ బహూకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

సంక్రాంతి పండగను పురస్కరించుకొని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పలక యశోద, ఉపాధ్యక్షులు కరక సోమనాయుడు బెల్లం దిమ్మలను బహూకరించారు. స్థానిక రింగ్ రోడ్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయనను కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పలక రవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## వాహన పన్ను పెంపుపై సిఐటియు నిరసన

ప్రజాశక్తి-రాంబిల్లి

వాహన పన్ను పెంపును వ్యతిరేకిస్తూ స్థానిక శ్రీకనకదుర్గ ఆటో, లారీ డ్రైవర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు బద్ది భాస్కరరావు, నాయకులు సిహెచ్ శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో సరుకు రవాణా, ప్రయాణికులు రవాణా వాహనాలపై ప్రభుత్వం పెంచిన 30శాతం పన్నును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కరోనాతో కష్టాలు పడుతున్న రవాణా రంగంపై డీజిల్ ధరలు, టోల్‌గేట్ ఛార్జీలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీవో అధికారులు కేసులు రాసి ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం రవాణా కార్మికులను ఆదుకోకపోగా ఇటువంటి భారాలు వేసి రవాణా రంగాన్ని మరింత ఇబ్బందులు గురి చేయడం తగదని పేర్కొన్నారు. జీవో నెంబర్ 21 వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే ఈ పెంపుపై రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి మాధవ్, ఉపాధ్యక్షులు శేషు, తాతారావు, లారీ డ్రైవర్ యూనియన్ నాయకులు రమణ, రాంబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




ఆందోళన చేస్తున్న ఆటో, లారీ కార్మికులు

## గాయపడిన టిడిపి కార్యకర్తకు పైలా ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కె.కోటపాడు

ప్రమాదంలో గాయపడిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త రొంగలి అబద్దంకు ఆ పార్టీ మాడుగుల నియోజకవర్గం సీనియర్ నాయకులు పైలా ప్రసాదరావు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అబద్దం తన కుటుంబంతో ప్రయాణిస్తుండగా పినగాడి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ప్రస్తుతం విశాఖలోని జిజి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అబద్దాన్ని పైలా ప్రసాదరావు శుక్రవారం పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. అబద్దం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట కె.కోటపాడు మాజీ సర్పంచ్ దోకల నరసింహ మూర్తి తదితరులు ఉన్నారు.




ఆసుపత్రిలో టిడిపి కార్యకర్తను పరామర్శిస్తున్న పైలా ప్రసాదరావు

## ఆకర్షిస్తున్న పక్షుల గూళ్లు

ప్రజాశక్తి-కశింకోట

మనుషులు నివాసానికి ఇళ్లు నిర్మించుకున్నట్లే.., కొన్ని రకాల పక్షులు చెట్లపై గూళ్లను నిర్మించుకొని అందులో తలదాచుకుంటాయి. ఎండ, వాన, చలి నుంచి రక్షణ పొందుతాయి. ఆ గూళ్లలోనే గుడ్లు పెట్టి పిల్లలను పొదిగి తమ సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయి. పీచు, పుల్లలు, వివిధ రకాల ఆకులతో ఈ గూళ్లను ఏర్పాటు చేసుకుంటాయి. మండలంలోని ఎస్.పేట గ్రామానికి వెళ్లే రహదారి పక్కనే తాడిచెట్టుపై ఇలా పక్షులు ఏర్పాటు చేసుకున్న గూళ్లు చూపురులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.



తాటి చెట్టు ఆకులకు పక్షులు అల్లుకున్న గూళ్లు

## మొలకెత్తని వేరుశనగ విత్తనాలు

ప్రజాశక్తి- కె.కోటపాడు

రైతు భరోసా కేంద్రాల ద్వారా గత నెలలో సరఫరా చేసిన వేరుశనగ విత్తనాలు పూర్తిస్థాయిలో మొలకెత్తడం లేదని ఏపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయినబాబు, ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్రా దేవుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేరుశనగ విత్తనాలు పూర్తిగా నాటకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రైతులు ఎంతో ఆశతో ప్రభుత్వం సరఫరా చేసిన వేరుశనగ విత్తనాలను బస్తా రూ.1600కు కొనుగోలు చేసి నాటారని పేర్కొన్నారు. ఇప్పుడు మొలకలు రాకపోవడంతో విత్తనాలు నష్టపోవడంతో పాటు ఈ ఏడాది పంట కూడా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న విరోతి చిన్న అప్పలనాయుడు

## ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం

రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విరోతి చిన అప్పల నాయుడు కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళారుల బెడద లేకుండా నేరుగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవడానికి ప్రతి ఆర్‌బికెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఎఈఒ బాలరాజు, డైరెక్టర్లు బోకం కాసుబాబు, చీపురుపల్లి సూర్యనారాయణ, వెంకట రమణ, సూరిశెట్టి రాము, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తర్వులు అందజేస్తున్న ఎయు విసి ఆచార్య ప్రసాదరెడ్డి

## డిసిఎంఎస్ బిఒఎస్ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ

ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆచార్య పి.వెంకటేశ్వర్లు నియమితుల య్యారు. ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి నుంచి ఈ మేరకు నియామక ఉత్తర్వులను స్వీకరించారు. అనంతరం విభాగంలో బిఒఎస్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఆచార్య వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఎయు డాక్టర్ వి.ఎస్.కృష్ణా గ్రంథాలయం లైబ్రేరియన్‌గా సేవలు అందిస్తున్నారు. ఆర్ట్స్ కళాశాల వార్డెన్‌గా కూడా సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లును విభాగ ఆచార్యులు, ఉద్యోగులు అభినందించారు.

## ప్రజా సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజా సమస్యలపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు పోరాడేందుకు ముందుకు రావాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని మార్టూరు గ్రామంలో శుక్రవారం కాఫీ విత్ కేడర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలతో పాటు, తమ పార్టీ శ్రేణులు కార్యకర్తలు సమస్యలు తెలుసుకుంటున్నామని చెప్పారు. వైసిపి అవినీతిపై సమిష్టిగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ

# క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి



విజేతలకు షీల్డ్, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కాశీవిశ్వేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేటప్పుడు క్రీడా స్ఫూర్తితో మెలిగి గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని టెన్నికాయిట్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ కాశి విశ్వేశ్వరరావు అన్నారు. ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ నిర్వహించిన 35వ అంతర్ జిల్లా సబ్ జూనియర్ బాల బాలికల టెన్నికాయిట్ పోటీల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇందులో కాశీ విశ్వేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై మక్కువ పెంచుకొని శారీరక మానసిక దారుఢ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న 13 జిల్లాల క్రీడాకారులను అభినందించారు. అనంతరం ఈ నెల 22 నుంచి రాష్ట్ర పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్ జన్మదిన సందర్భంగా అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే అంతర్ రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన ఆంధ్రప్రదేశ్ జట్టును ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి తవిటయ్య, ప్రకాశం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, రంగస్వామి, వై గోవింద, పి రమణ రావు, ఆర్ నారాయణ రావు, కే యం నాయుడు, నారాయణమ్మ, లక్ష్మణరావు, కెవిఎస్‌వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హిట్లర్‌ను మించిన జగన్

### టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-అనకాపల్లి



మాట్లాడుతున్న టిడిపి నాయకులు అయ్యన్నపాత్రుడు తదితరులు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన హిట్లర్ పాలనను మించిపోయిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గవరపాలెం మళ్ల జగన్నాథం కళ్యాణ మండపంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అధ్యక్షతన టిడిపి సోషల్ మీడియా శిక్షణా కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా వైసిపి పాలనపై పోరాడాలని పిలుపునిచ్చారు. అవినీతిపై పోరాటంలో యువతదే కీలక పాత్ర అన్నారు. జగన్మోహన్ రెడ్డి జారీ చేసిన బ్రిటీష్ ప్రభుత్వం కాలం నాటి జీవో నెంబర్ -1పై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అవినీతి శాఖ మంత్రిగా మారారన్నారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే తిరిగి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, కొణతాల రత్న కుమారి, బిఎస్ఎంకె జోగి నాయుడు, సబ్బవరపు గణేష్, పోలవరపు త్రినాథ్, నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్, కర్రి బాబీ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి కానుకగా మరో బాదుడు

ప్రజాశక్తి-అనకాపల్లి

సంక్రాంతి కానుకగా ప్రజలపై రవాణా శాఖ ద్వారా జగన్మోహన్‌రెడ్డి మరో బాదుడు వేస్తున్నారని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్ విమర్శించారు. స్థానిక రింగ్ రోడ్‌లోని టిడిపి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నాలుగేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి చెత్త పన్ను, ఆస్తి పన్ను, ఆర్టీసీ, విద్యుత్ ఛార్జీలు, పెట్రోలు డీజిల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారని తెలిపారు. ఇప్పుడు రవాణా శాఖ ద్వారా ఆటో నుంచి ఆర్టీసీ బస్సుల వరకు రాష్ట్ర ప్రభుత్వం పన్నులు వేసిందని తెలిపారు. దీని వల్ల ప్రజలపై రవాణా ఛార్జీలు మరింత భారంగా పెరగనున్నాయన్నారు. ఏ రాష్ట్రంలో లేనంత పెట్రోలు, డీజిల్ ధరలు ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నాయని, దీంతో రవాణా రంగం మరింత సంక్షోభంలోకి వెళుతుందని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాల లారీల కిరాయిలతో పోటీ పడలేక ఎపి రాష్ట్ర లారీ ఓనర్లు వాహనాలను అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి గ్రీన్ టాక్స్ కింద పక్క రాష్ట్రాలు రూ.200 వసూలు చేస్తుంటే మన రాష్ట్రంలో ఏకంగా రూ.20 వేలు వసూలు చేయడం దారుణమన్నారు. పక్క రాష్ట్రాల్లో మూడు నాలుగు త్రైమాసిక పన్నులు రద్దు చేయగా, మన రాష్ట్రంలో పన్నుల మీద పన్నులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చారని, తక్షణమే దీనిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కోట్ని బాలాజీ, ధనాల విష్ణు చౌదరి, బోడి వెంకటరావు, బొడ్డేడ మురళి పాల్గొన్నారు.

## నేడు భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి- మునగపాక రూరల్

స్థానిక పల్లపు వీధి వినాయక మందిరం కేంద్రంగా నిర్వహిస్తున్న మేలుకొలుపు ఉత్సవాలు ఈనెల 14తో ముగియనున్న సందర్భంగా, భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఉత్సవ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ధనుర్మాస ఆరంభం నుండి పలువురు భక్తులు ప్రతిరోజు వేకువజామున నిద్రలేచి గ్రామంలోని దేవాలయాలకు వెళ్లి, దేవతా మూర్తులను దర్శించి భజనలు గీతాలు ఆలపిస్తూ సంకీర్తన చేశారు. దీనిలో భాగంగానే సంక్రాంతి ప్రారంభ పండుగ అయిన భోగి రోజున అన్న సమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



తహశీల్దారుతో మాట్లాడుతున్న ఆర్.భీమవరం గ్రామస్తులు

## భూ ఆక్రమణలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని ఆర్ భీమవరం పరిధిలో 12 ఎకరాలకు పైగా భూమిని అధికార పార్టీకి చెందిన కొంతమంది ఆక్రమించుకున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం స్థానిక తహశీల్దార్ ఎస్‌వి అంబేద్కర్‌కు ఆర్.భీమవరం మాజీ సర్పంచ్ మలిరెడ్డి బుజ్జి, వెలంకాయల అప్పలనాయుడు తదితరులకు వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన వెలుగుల రాజారావు భూపతిపాలెం జంక్షన్‌కు సమీపంలో వైయస్సార్ విగ్రహం వద్ద సుమారు 40 సెంట్లు ప్రభుత్వ భూమిని, పంట కాలువను జెసిబితో చదును చేయించి ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. అలాగే కొండ వద్ద ఆరు ఎకరాల భూమిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. గ్రామంలోని ఎలంకయల చెరువు భూమి ఆరున్నర ఎకరాలకు పైగా భూమిని గ్రామానికి చెందిన కాలపురెడ్డి అప్పారావు, రాయి ఈశ్వరరావు, ఎలంకయల రామునాయుడు తదితరులు ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, మాజీ జడ్పిటిసి సభ్యులు బియ్యపు అప్పారావు, మల్లం ఎంపిటిసి కంచిపాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ ఎలంకయలు అప్పలనాయుడు, నీలకంఠాపురం మాజీ సర్పంచ్ కోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 16న బౌద్ధ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రతి ఏటా కనుమ పండుగ రోజు ప్రసిద్ధ ప్రాచీన బౌద్ధారామ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద నిర్వహించే బౌద్ధమేళా ఈ ఏడాది కూడా కన్నుల పండగగా జరగనుంది. ఇందుకు కావలసిన ఏర్పాట్లను విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య చేస్తోంది. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మయన్మార్ బౌద్ధ భిక్షువు వినరబుల్ ఆయుపాల మహాథేరో, శ్రీలంక బౌద్ధ భిక్షువు వెనరబుల్ బోధిహిం భాంతేజీ ఆధ్వర్యంలో ప్రధాన స్థూపంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించడం జరుగుతుందని విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రచార కార్యదర్శి, సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం తెలిపారు. అనంతరం సభా ప్రాంగణంలో బౌద్ధ పతాకాలతో కొండపైకి పంచశీల ర్యాలీ, ధమ్మ సందేశం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ సత్యవతి, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విష్ణుమూర్తి, బుద్ధ భూమి మాసపత్రిక సంపాదకులు బొర్ర గోవర్ధన్, విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ప్రతినిధులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## 'నాగులాపల్లి'కి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని రాజాం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ నాగులపల్లి సత్యనారాయణను చోడవరం మాజీ శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం పరామర్శించారు. రాజాంలోని సత్యనారాయణ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి ఆయన బాగోగులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మరిసా సతీష్, మాజీ సర్పంచ్ ఎండపల్లి సత్యారావు, టిడిపి నాయకులు మరిసా నరేష్, సామాజిక కార్యకర్త ఆకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నాగులాపల్లి సత్యనారాయణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

# జూదాలకు పాల్పడితే చర్యలు

**సిఐ తాతారావు**


మాట్లాడుతున్న సిఐ

**ప్రజాశక్తి- చీడికాడ:** కోడి పందేలు, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని, వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించామని సర్కిల్ ఇన్స్పెక్టర్ తాతారావు తెలిపారు. ఆయన చీడికాడ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు ఆయన విలేకరులతో మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సందర్భంగా గతంలో కొన్ని ప్రదేశాల్లో కోడిపందాలు, నిర్వహించారని, దీంతో, ఇందుకు అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి దాడులు చేస్తున్నామన్నారు. కోడిపందాలు జరిగే అవకాశం వున్న స్థావరాలపై నిరంతరం నిఘా ఉంచామన్నారు. గతంలో కోడిపందాలు ఆడుతూ పట్టుబడిన వారిని మరలా కోడి పందేలలో పాల్గొనకుండా బైండోవర్‌లు చేయాలన్నారు. వారిపై నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. పండుగ సమయంలో ప్రజలందరూ అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి సాంప్రదాయ బద్ధంగా చేసుకోవాలని సిఐ తాతారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు

**గొలుగొండ:**సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందాలు, పేకాట, గుండుఆట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై నారాయణరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పండుగను సంప్రదాయబద్ధంగా కుటుంబ సభ్యులతో కలిసి జరుపు కోవాలన్నారు. ఇటువంటి అసాంఘిక కార్యకలపాలపై స్పెషల్ పోలీస్ టీంతో గ్రామాల్లో నిఘా ఉంచామన్నారు.

## వైభవంగా వెంకన్న ఊరేగింపు

**ప్రజాశక్తి-నక్కపల్లి:**ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస అధ్యయన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పెద్దపల్లకీ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, చిన్న పల్లకిలో గోదాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను శుక్రవారం వైభవంగా తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. పుష్ప తోటలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదా చార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం గోపాల ఆచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు, ఆలయ సిబ్బంది సందీప్, గురవయ్య, వేలు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.


ఊరేగిస్తున్న భక్తులు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- నర్సీపట్నంలో పోలీసుల ప్రచారం**

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:**సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణాలు చేస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది శుక్రవారం ముమ్మరంగా ప్రచారం చేశారు. ఇతర ప్రదేశాలకు వెళ్లే ప్రజలు తమ విలువైన బంగారు ఆభరణాలను, నగదును లాకర్లో భద్రపరుచుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు సంచరించినప్పుడు వెంటనే పోలీసులకు తగు సమాచారం ఇవ్వాలని కోరారు. పేకాట, కోడిపందాలు ఆడటం నేరమని, ఎవరైనా వీటిని నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు ముందుగా పోలీసుల పర్మిషన్ తీసుకోవాలన్నారు. డాన్స్ బేబీ డాన్స్ వంటి నిషేధమని, పర్మిషన్ లేకుండా ఏ కార్యక్రమాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ప్రచారం చేస్తున్న పోలీసులు

# పలుచోట్ల చీరల పంపిణీ

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని పాతమల్లంపేట పంచాయతీ పరిధిలో నిరుపేద మహిళలకు సంక్రాంతి సందర్భంగా చీరలు పంపిణీ చేశారు. పాతమల్లంపేట పంచాయతీ ద్వారకానగర్‌కు చెందిన లెక్కల కుటుంబ సభ్యులు కలిసి అందజేయడం స్ఫూర్తిదాయకమైన విషయమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ కొనియాడారు. ద్వారకానగరంలో శుక్రవారం పాతమల్లంపేట పంచాయతీ గ్రామస్తులు, నిరుపేదలకు సంక్రాంతి సందర్భంగా 500 మందికి చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యన్నారాయణ తల్లి జ్ఞాపకార్థం ప్రతీ ఏటా ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం చాలా మంచిదని తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉన్న 14 గిరిజన, మైదాన గ్రామాల ప్రజలంతా పండుగ సందర్భంగా సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమం చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు సత్యన్నారాయణకు తోడుగా కుటుంబ సభ్యులు అంతా కలిసి ముందుకు రావడం సంతోషకరమైన విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సుర్ల వెంకటగిరిబాబు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత, మండల యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, మాజీ ఎంపిపి కుంత్సం లక్ష్మీనారాయణ, పలువురు నాయకులు కార్యకర్తలు లెక్కల కుటుంబీకులు, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**మాడుగుల:**సంక్రాంతి సందర్భంగా పలు శాఖలకు చెందిన సిబ్బందికి మండలంలోని ఎం కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. .గ్రామానికి చెందిన సచివాలయం, వెలుగు సిబ్బంది, వార్డు సభ్యులు, పారిశుధ్య కార్మికులకు ఆయన చీరలు అందజేశారు.


పట్టుబడ్డ నిందితులు

## పేకాట శిబిరంపై దాడి

**ప్రజాశక్తి- ఎస్.రాయవరం:** మండలంలోని కొరు ప్రోలు గ్రామ శివారులో పేకాట స్థావరం పై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు స్థానిక ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బంది తో దాడి చేశామన్నారు. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులతో పాటుగా రూ.28200 నగదు, 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వీరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

# ఆర్‌టిసి స్థలం లీజుపై పునరాలోచించాలి

**మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు**



**ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్, అనకాపల్లి :** ప్రజల ఆమోదం లేకుండా నర్సీపట్నం ఆర్టీసీ లీజు స్థలంలో అంగుళం కూడా నిర్మాణం జరగదని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. గురువారం ఆయన విడుదల చేసిన వీడియోలో ఈ విధంగా మాట్లాడారు. ఆనాడు టీడీపీ హయాంలో షాపింగ్ కాంప్లెక్స్ కట్టడానికి చంద్రబాబు సమయంలో నిర్ణయం తీసుకున్నారని, తాను అప్పుడు మంత్రిగా ఉన్నప్పటికీ అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ కడితే రద్దీ పెరుగుతుందని, ప్రజలు ఇబ్బందులు పడతారని విభేదించి నిలుపుదల చేయించినట్లు తెలిపారు. ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద నాలుగు థియేటర్లు, పెట్రోల్ బంక్, దుర్గమ్మతల్లి ఆలయం, బ్యాంకులు, ప్రైవేటు పాఠశాలలు చాలా ఉన్నాయని, దీంతో ఇక్కడ నిత్యం రద్దీ పెరిగి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కనీసం నర్సీపట్నంలోని పెద్దలు, అధికారులు, ప్రజా సంఘాల నాయకులు, అన్ని పార్టీల నాయకులతో మాట్లాడి ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఈ నిర్ణయం తీసుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇక్కడ తరచూ ట్రాఫిక్‌తో ట్రాఫిక్ పోలీసులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై ఆర్టీసి అధికారులు పునరాలోచించి నర్సీపట్నం ఆర్డీవో సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి అన్ని ప్రజా సంఘాలు, నాయకుల అభిప్రాయాలు తీసుకొని నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

**ప్రజల అభిప్రాయం తీసుకోవాలి: జనసేన**

**ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్:**నర్సీపట్నం మున్సిపాలిటీ ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ఆర్‌టిసి స్థలం లీజుకు అధికారులు టెండర్లు ఆహ్వానించడం సరైన నిర్ణయం కాదని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఆర్టీసి స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఈ ప్రాంతం అత్యంత రద్దీగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. జనసేన పార్టీ టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్ మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీలోని ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా ఇటువంటి నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. అధికారులు పునరాలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే జనసేన ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య, నాయకులు కొత్తకోట రామ శేఖర్, నాతవరం మండల నాయకులు వేగిశెట్టి శ్రీనివాస్, మాకిరెడ్డి వెంకటరమణ, దత్తుడు తదితరులు పాల్గొన్నారు.


సంబరాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బూడి

## సంక్రాంతి సంబరాలకు బూడికి ఆహ్వానం

**ప్రజాశక్తి-మాడుగుల:**ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు మాడుగుల భారత నిర్మాణ సేన సభ్యులు శుక్రవారం తరువా క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన కరపత్రం అందజేశారు. మాడుగులలో మూడు రోజులపాటు సంక్రాంతి సంబరాలలో భాగంగా ముగ్గుల పోటీలు, షటిల్, బ్యాడ్మింటన్, సాంప్రదాయ దుస్తుల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అధిక పాల ఉత్పత్తిదారులకు అభినందనలు, మాడుగుల సీనియర్ కళాకారుల ఆధ్వర్యంలో నాటిక ప్రదర్శన తదితర కార్యక్రమాలకు హాజరు కావాలని ఆయనకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో గౌరిపట్టపు మహేష్, సిహెచ్ మధు రామ్ పాల్గొన్నారు.

## పండగకు సన్నద్ధం

**ప్రజాశక్తి-మాడుగుల:**మండల కేంద్రంలో భారత నిర్మాణ సేన ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించనున్నారు. సాంప్రదాయ ముగ్గుల పోటీలతో పాటు షటిల్ బ్యాడ్మింటన్, అధిక పాల ఉత్పత్తిదారులకు సన్మానం నిర్వహిస్తారు. ఆదివారం సంక్రాంతి రోజున మాడుగుల కళాకారుల ఆధ్వర్యంలో మంచం మీద మనిషి నాటిక ప్రదర్శిస్తారు. ఈ నాటికకు సురేష్ శాంతో దర్శకత్వం వహిస్తుండగా పర్యవేక్షణ దంగేటి సూర్యారావు, కళాకారులు లకిడపు సుందర రాజు, జాగాని ఈశ్వరరావు, గర్భాపు దామొదరారావు, బైరా శ్రీను, యూసఫ్, ఖాసిం, తాడి గణేష్, తూరుబిల్లి అర్జున తదితరులు నటిస్తున్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

## అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన

**ప్రజాశక్తి - కొత్తకోట:**రావికమతం మండలంలో శుక్రవారం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ దాత్రి రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. టి.అర్జాపురం, చీమలపాడు పంచాయతీలలో ఆమె పర్యటించి సచివాలయాలు, అంగన్ వాడి కేంద్రాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, జగనన్న లే అవుట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల స్థలాల పంపిణీలో రెవిన్యూ పరమైన సమస్యలు తలెత్తకుండా చొరవ తీసుకోవాలని తహసిల్దార్‌కు సూచించారు. చీమలపాడు సచివాలయంలో సిబ్బంది సమయపాలన పాటించాలని, సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా చీమలపాడు గ్రామానికి చెందిన ఓ బాలుడు సాంప్రదాయ దుస్తుల్లో రావడంతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం సచివాలయం, రైతు భరోసా కేంద్రంలో రికార్డులను పరిశీలించి తగు సూచనలను చేశారు. వార్డు వాలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. అర్హత గల లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని వాలంటీర్లకు దిశా నిర్దేశం చేశారు. ఆమె వెంట తహసిల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, ఈవోపీఆర్డి రమణయ్య, హౌసింగ్ ఏఈ రామచంద్రరావు, అర్జా పురం, చీమలపాడు సర్పంచ్‌లు మడగల అర్జున, వంజరి గంగరాజు, పంచాయతీ కార్యదర్శి కె. కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## మిఠాయిల కంటే బాదం మేలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మిఠాయిల స్థానంలో బాదం ఉత్పత్తులు శ్రేయస్కరమని ప్రముఖ న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి అన్నారు. నగరంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వేడుకల్లో సందర్భంలోనూ ఆరోగ్యంపై దృష్టి నిలపాలన్నారు. కార్యక్రమంలో సినీ నటి నిషా గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సత్తా చాటిన విద్యార్థినులు

## బాక్సింగ్‌లో విద్యార్థినుల సత్తా

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:ఈ నెల 12న ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన ఏయు అంతర్ యూనివర్సిటీ వూష సెలక్షన్స్ టోర్నమెంట్‌లో నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో చదువుతున్న ముగ్గురు ఉమెన్ బాక్సర్లు పతకాలు సాధించారు. వీరిలో లాలం ప్రవల్లిక(60 కేజీల విభాగం)లో గోల్డ్ మెడల్ సాధించారు. వేపాడ ప్రియాంక(65 కేజీల విభాగంలో) గోల్డ్ మెడల్, జి.జ్ఞానావతి(48 కేజీల విభాగంలో) సిల్వర్ మెడల్ సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, పిడి సురేష్ బాబు, శాప్ కోచ్ అబ్బు, బాక్సింగ్ ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ. వెంకటేశ్వరరావు, వూష అసోసియేషన్ కోచ్ రమ్య, నేషనల్ వూష రిఫరీ వెంకట్, నింజాస్ అకాడమీ డైరెక్టర్లు, తల్లిదండ్రులు అభినందించారు.



చెక్కును ఇస్తున్న గేదెల సత్యనారాయణ

## బోనస్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి -రావికమతం:పాల సొసైటీ సంఘాలకు 63 లక్షల 42,999ల చెక్కులను విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డైరీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ, డైరీ చైర్మన్ ఆడారి తులసిరావు మరణం మనకందరికీ తీరని లోటన్నారు. సంక్రాంతి సందర్భంగా బోనస్ అందించాలన్న ఉద్దేశంతో పాల సంఘం అధ్యక్ష కార్యదర్శులకు బోనస్ చెక్కులను అందజేశామన్నారు. రావికమతం, మాడుగుల, బుచ్చయ్యపేట మండలాలకు చెందిన 38 పాల సంఘాలకు అందిస్తున్నామన్నారు. డైరీ సహాయంతో జిల్లాలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో తులసీరావు నిలిచారని కొనియాడారు. అదే స్ఫూర్తితో తనయుడు ఆనందబాబు పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సూపర్వైజర్ ప్రసాద్, అసిస్టెంట్ సూపర్వైజర్ అప్పారావు, 37 పాల సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు పాల్గొన్నారు.

## బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో రామచంద్రపాలెం గ్రామానికి చెందిన కరక రాజబాబు అనే వ్యక్తి పలు దొంగతనాలలో దోచిన మూడు తులాల బంగారం గొలుసు, రెండు కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ నారాయణరావు తెలిపారు., పట్టుబడ్డ రాజుబాబును రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళలతో మాట్లాడుతున్న బూడి

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే తెలిపారు. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో బాగంగా గ్రామాల్లో పర్యటించారు.**

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని ఎ.కొత్తపల్లి గ్రామంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు కోలాటంతో మంత్రికి స్వాగతం పలికారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని రైతు చేత ప్రారంభింపజేశారు. రూ.17.50 లక్షలతో ఏర్పాటు చేసిన వైయస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో రూ.18.22 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. సుమారు కోటి రూపాయలతో 90 వేల లీటర్ల నీటి సామర్ధ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులను స్వయంగా పరామర్శించారు. నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కర్రి సత్యం, వైస్ ఎంపిపి చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల వెంకటరమణ, మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, వైపిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, నాయకులు రొంగలి నారాయణమ్మ పాల్గొన్నారు.

**చోడవరం :** చోడవరం పట్టణంలోని ఇందిరా కాలనీ, దుర్గ కాలనీ, ఎడ్ల వీధి తదితర ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. మహిళలు తమకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు మంజూరు కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆయన స్పందించి అర్హత ఉంటే తక్షణమే పథకాలు అందజేయాలని వెంటనే అధికారులను ఆదేశించారు. వాళ్ల వీధిలో ఇళ్ల పట్టాల సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానిక తహశీల్దార్ తిరుమల బాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బైన ఈశ్వరరావు, వైసిపి నాయకులు ఒరుగంటి నెహ్రూ బాబు, నాగు, ప్రకాష్, చెన్నం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**ఎస్.రాయవరం:**రాష్ట్రప్రభుత్వం ప్రజలకు నేరుగా అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఇంటా అందాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. శుక్రవారం కొరుప్రోలు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి పాటు పడుతున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారు వెంటనే సచివాలయంలో ధరఖాస్తు చేయాలని సూచించారు. ఆయన వెంట గ్రామ వైసిపి నాయకులు చేకూరి శ్రీరామచంద్రరాజు, పోలిశెట్టి పెదఈశ్వరరావు, నూకునాయుడు, కొర్ని రాజా రమేష్, మామిడి చంటి తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

# 18న సినిమా బండి చిత్ర ప్రదర్శన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరానికి చెందిన యువ దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో రూపొందించిన 'సినిమా బండి' చిత్ర ఉచిత ప్రదర్శన ఈ నెల 18న పౌర గ్రంథాలయంలో ఉంటుందని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినిమా బండి ఉచిత ప్రదర్శన అనంతరం ఆ సినిమా డైరెక్టర్ ప్రవీణ్ కాండ్రేగులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సినిమా బండి చిత్రం 2022 గోవా అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో స్పెషల్ జ్యూరీ అవార్డు సాధించిందని చెప్పారు. అలాగే చెన్నయ్, కొల్‌కతాల్లో జరిగిన అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్‌లో పలువురి ప్రశంసలు పొందిందని అన్నారు. 2021లో ఈ సినిమా నెట్‌ఫ్లెక్స్‌లో విడుదలైందన్నారు. గంటా 40 నిమిషాల నిడివిగల ఈ సినిమా ఎంతోమంది ప్రశంసలు అందుకుందన్నారు. వైజాగ్ జర్నలిస్ట్ ఫోరమ్ అధ్యక్షులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విశాఖలో ప్రతిభకు కొదవలేదన్నారు. సమావేశంలో సినీ కథా రచయిత సత్యాడ నరసింగరావు, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ జి.బాబ్జీ, ఆర్.శివకుమార్ పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు



రికార్డులు పరిశీలిస్తున్న చిట్టినాయుడు

## పశు వైద్యశాలల తనిఖీ

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని పెదగోగాడ, ఖండి వరం పశు వైద్యశాలలను మాడుగుల ఏరియా పశువైద్యశాఖ సహాయ సంచాలకులు చిట్టి నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం జి.కొత్తపల్లి, జైతవరం గ్రామాలలో రైతు భరోస కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గొర్రెలకు బొబ్బ వ్యాధి రాకుండా టీకాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు ఎ.గణేశ్, గాయత్రి దేవి, రాఘవమ్మ, గ్రామ పశువైద్య సహాయకులు కురచా అర్జునమూర్తి, ఎం.శ్రీనివాసరావువర్మ పాల్గొన్నారు.

# త్వరితగతిన గృహాలు నిర్మించాలి

కలెక్టర్ రవిసుభాష్

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలోని పలు గ్రామాలలో కలెక్టర్ రవిసుభాష్ శుక్రవారం ఆకస్మిక పర్యటన చేపట్టారు. దార్లపూడి, చినగుమ్ములూరు, పెదగుమ్ములూరు గ్రామాల సచివాలయాల పపరిధిలోని జగనన్న కాలనీలను సందర్శించారు. జగనన్న కాలనీలు త్వరితగతిని పూర్తి చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం కేటాయించిన లే అవుట్లలో కోర్టు కేసులు ఉంటే ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించి కేటాయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్లబాబూరావు, ఎంపిడివో రామచంద్రమూర్తి, నాయకులు పాల్గొన్నారు.



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్

## క్రికెట్ లీగ్ ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలోని రాట్నాల పాలెంలో సంక్రాంతి సందర్భంగా శుక్రవారం క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సుమారు 25 జట్లు పాల్గొన్నాయి. ఈనెల 16 వరకు జరిగే ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.30000, రెండవ బహుమతి రూ.20000, మూడో బహుమతి రూ.10000 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



క్రీడాకారులతో సర్పంచ్ అనిల్ కుమార్

## మహిళలకు చేయూత

ప్రజాశక్తి-కోటవురట్ల:మహిళలకు చేయూత నందించేందుకే జిల్లాలో మూడు మహిళా మార్టులు ప్రారంభిస్తున్నట్లు చేయూత డిపిఎం వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రస్తుతం మాడుగుల ఏర్పాటు చేయగా కోటవురట్ల, సబ్బవరం మండలాల్లో త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఏపీఎం రమణకుమారి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఎం